
# రేవంతం.. నీ కథ సమాప్తం!

- పీసీసీ చీఫ్ రేవంత్‌పై రైతుల మండిపాటు
- 10హెచ్‌పీ మోటర్ల వ్యాఖ్యలపై ఆగ్రహం
- భూగర్భ జలాల సంగతి ఏమిటంటూ ప్రశ్న
- 24 గంటల ఉచిత కరెంట్‌పై కాంగ్రెస్ కుట్రలు
- హస్తం పార్టీ మాయలో పడొద్దని రైతుల హితవు



నిజామాబాద్, నవంబర్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దేశంలో మరెక్కడా అమలు కాని విధంగా రైతులకు నిరంతర ఉచిత విద్యుత్ తెలంగాణ రాష్ట్రంలోనే అందుతున్నది. నిరంతరాయంగా సాగుకు అందిస్తున్న కరెంట్‌తో అన్నదాతలకు ఎనలేని ప్రయోజనం చేకూరుతున్నది. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో రాత్రి, పగలు తేడా లేకుండా రైతులంతా పొలాల్లోనే తిష్ట వేసుకుని కాపు కాసి కరెంట్ వచ్చినప్పుడు పొలాలకు నీళ్లు పట్టి వీలుంటే ఇంటికి వచ్చేది. చీకట్లో పాము కాట్లకు, తేలు కాట్లకు బలయ్యేది. చిమ్మ చీకట్లో విష పురుగుల మధ్య సావాసం చేసేది. కరెంట్ తీగలకే తగిలి ఉసురు తీసుకునే దుస్థితి గతంలో నిత్యకృత్యం. కరెంట్ కోసం రోడ్డెక్కి రైతన్నలు ధర్నాలు, ఆందోళనలు చేసేది. ఇదంతా 2014కు పూర్వం రైతులకు ఎదురైన చేదు అనుభవాలు. కానిప్పుడు తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయరంగ స్వరూపమే మారిపోయింది. సాగుకు నిరంతరాయంగా విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. నిరంతర ఉచిత విద్యుత్ సరఫరాపై కాంగ్రెస్ పార్టీ ఇప్పుడేకంగా గిమ్మిక్కు రాజకీయాలకు పాల్పడుతున్నది.

**10హెచ్‌పీ సిద్ధాంతం...**

పీసీసీ చీఫ్ ఒక టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో 10 హెచ్‌పీ మోటర్లతో 3గంటల్లో 3 ఎకరాలకు సాగు నీటిని పారించుకోవచ్చంటూ కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. వాస్తవానికి ఈ 10హెచ్‌పీ సిద్ధాంతం అన్నది అమలుకు అసాధ్యమైన పని. 10హెచ్‌పీ మోటర్ల వాడకం వాడకం ద్వారా నీళ్లను భారీగా ఎత్తిపోయడం మూలంగా భూగర్భ జలం నిమిషాల్లోనే ఖతం కావడం ఖాయం. అంతేకాకుండా కరెంట్ వినియోగానికి ఆ స్థాయి సామర్థ్యానికి తగ్గట్లుగా మౌలిక సదుపాయాల కల్పన అన్నది గగనం. 10హెచ్‌పీ వాడకంలో మోటర్లు దెబ్బతింటే, మరమ్మతులు చేసుకోవడం కత్తిమీద సాములాంటిది. వాటికయ్యే ఖర్చు కూడా భారీగానే ఉంటుంది. 10హెచ్‌పీ మోటర్ కొనుగోలు కూడా రైతులకు ఎనలేని భారంతో కూడుకున్నది. ప్రస్తుతం రైతులు వాడుతున్న మోటర్ల కెపాసిటీ కేవలం 3హెచ్‌పీ లేదంటే 5హెచ్‌పీ వరకే గరిష్ఠంగా ఉంది.

**మండిపడుతున్న రైతులు...**

రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 10హెచ్‌పీ మోటార్ల వాడకంపై రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరంతర విద్యుత్ సరఫరా అందుతున్నదని తద్వారా ఎలాంటి ఇబ్బందులు రైతులకు ఎదురు కావడం లేదని వా రంతా చెబుతున్నారు. కాంగ్రెస్ పాలనలో నిరంతర విద్యుత్ అన్నదే కనిపించలేదు. ఉచిత విద్యుత్ హామీని సరిగ్గా నిలబెట్టుకోలేక గత కాంగ్రెస్ పాలకులు చతికిల పడిన సందర్భాలున్నాయన్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ మరోమారు రైతులను మోసగించేందుకే 10హెచ్‌పీ మోటర్ల సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ కర్షకుల కండ్లలో మట్టి కొట్టేందుకు సిద్ధమైందంటూ రైతులు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేకనే కర్ణాటకలో 5గంటల కరెంట్‌ను అమలు చేస్తోందన్నారు. పక్క రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలోనూ రైతులను మోసం చేసేందుకే ఇలాంటి కు టిల కుట్రలకు పాల్పడుతున్నదని కర్షకులంతా చెబుతున్నారు.

**కరెంట్ కుట్ర...**

తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీతో కాల్చడానికి వెళ్లిన ఘన చరిత్ర రేవంత్ రెడ్డిది. తెలంగాణ వచ్చాక, చంద్రబాబుతో కలిసి కేసీఆర్ ప్రభుత్వాన్ని కూలగొట్టడం కోసం చేసిన కుట్రలోనూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికి జైలు కు వెళ్లిన సంగతి కూడా ప్రజల్లో ఉన్నదే. రైతుబంధు వృథా అంటూ వ్యాఖ్యనాలు చేసిన గొప్పతనం కూడా పీసీసీ చీఫ్‌కు దక్కుతుంది. రైతుకు 3గంటల కరెంట్ చాలంటూ పదే పదే వల్లిస్తున్నాడు. అవగాహనారాహిత్యం, అసమర్థత నేపథ్యంలో తగుదునమ్మా అంటూ కర్ణాటక నుంచి కాంగ్రెస్‌కు చెందిన 40 మంది ఎమ్మెల్యేలు, 10 మంది మంత్రులు, ఇంకొంత మంది ధనిక వర్గాలకు చెందిన నాయకత్వం ఏకమై తెలంగాణ రాజకీయాల్లోకి చొచ్చుకొచ్చి ప్రచారంలో మునిగి తేలుతున్నారు. వీళ్లంతా ఎలక్షన్ ప్రచారం పేరుతో రేవంత్ రెడ్డి చేస్తున్న జుగుప్సాకరమైన రచ్చ కు తోడూ నీడగా నిలబడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న మంచిని ఎదుర్కోలేక కుటిల నీతితో కుట్రలు చేస్తుండడంతో సర్వత్రా కాంగ్రెస్ నైజం బయటపడుతున్నది.

## రాత్రి పూట కరంటుతోనే నా భర్త సచ్చిపోయిండు..



బాన్సువాడ, నవంబర్ 17 : కాంగ్రెస్ గవర్నమెంటు ఉన్నప్పుడు రాత్రి పూట కరంటు ఇచ్చుడుతోటి మా ఇంటాయన రాంగొండ ప్రాణాలు ఈడిసిండు. అప్పట్ల పొద్దున రెండు గంటలు, రాత్రి మూడు గంటలు కరంటు ఇస్తుండ్రి. మా ఇంటాయన మోటర్ నడుస్తలేదని చూసేతందుకు పొలం కాడికి పోయిండు. ఫీజు ఏశెటప్పుడు షాక్ కొట్టి సచ్చిపోయిండు. అయినా కాంగ్రెసోళ్లు వోళ్లు మమ్ములను పట్టించుకోలె.. ఎవళ్లన్న అచ్చి ఎట్లున్నవు అవ్వ అని అడిగిన పాపాన పోలె. నాకు ఇద్దరు ఆడపిల్లలు ఇంతన్న సాయం అందించలె. గిప్పుడు సీఎం కేసీఆర్ అచ్చినంక మస్తు మంచిగున్నది. 24 గంటలు కరెంటు ఇచ్చుడుతోటి పొద్దుగల్ల పూటనే పొలాలకు నీళ్లు పెట్టి ఇంటికి అస్తున్నం.. మల్లా గిప్పుడు రేవంతు వచ్చి మూడు గంటలు సాలు అంటున్నడు. మల్లా పాత రోజులు యాదికి చేసుకుంటేనే భయమైతున్నది. ఇంత మంచి సౌలత్ జేసిన కేసీఆర్ సారే మల్లా రావాలె.

**- ఉప్పరిగారి సత్యవ్వ ( పాత బాన్సువాడ )**

## మూడు గంటలైతే మల్లా కష్టాలే..



డోంగ్లీ,నవంబర్ 17 : తెలంగాణ గవర్నమెంటు 24 గంటల ఉచితంగా కరెంటు ఇస్తున్నప్పటి సంది మొత్తం పొలం పడుతున్నది. ఒక్క గుంట కూడా బీడుగా ఉండడం లేదు. గతంల విడుతల వారీగా కరెంటు ఇచ్చుడుతోటి మస్తు తిప్పలు వడ్డం.. రాత్రి, పగలు లేకుండా పొలాల పొంటి తిరుగుతుంటిమి. ఇంటికి అస్తమన్న గ్యారంటీ ఉండకుండే. పాణం అరచతిలో పట్టుకొని ఇండ్లకు అస్తుంటిమి. కేసీఆర్ గర్నమెంట్ అచ్చినంక పొద్దున్నే బాయి కాడికి పోయి పొలాలకు నీరు పారిచ్చి సాయంత్రం బందు చేసి అస్తున్నాం. సాయంత్రం గూడా అవసరమైతే స్ప్రింక్లర్లు పెట్టేస్తున్నాం. పక్కనే మహారాష్ట్ర ఉంది.. అక్కడా ఇప్పటికి ఎనిమిది గంటల కరెంటే ఉంది. మోటర్ పంపు హెచ్‌పీల వారీగా బిల్లులు చెల్లిస్తారు. మూడు గంటల కరెంటుతోటి మళ్లీ ఆగమైతది.

**-పట్నె సూర్యకాంత్, మొఘ, మండలం డోంగ్లీ**

## మూడు గంటలు కరంటు ఇస్తే.. ఎవుసం ముందట వడదు..



ఎల్లారెడ్డి, నవంబర్ 17 : వర్షాలు తక్కువ వడ్డా.. కరంటు గిట్లనే ఇస్తే ఏం తక్‌లీఫ్ గాదు. మూడు గంటల కరంటు అయితే ఎవుసం ముందట వడదు. ఎవుసానికి ఎంత తక్కువ అన్నా 15 గంటలు ఉండాలే. ఇప్పుడు వానకాలంలో 20 గంటల కరంటు అచ్చింది. పంటలు మంచిగ పండినయి. భూమిలో ఉన్న నీళ్లు వట్టి మోటరు పెట్టుకోవాలె. పది హస్పర్ మోటరు పెట్టుకుంటే ఉత్తదే. ఈడ ఇంచు, ఇంచున్నర, రెండు ఇంచుల నీళ్లే ఉంటాయి. దీనికి ఐదు హస్పర్ల మోటరు పెట్టుకుంటనే నడుస్తది. పది హస్పర్ల మోటర్లు పెట్టుకుంటే ఉన్న నీళ్లు గంటలనే అయిపోతయ్. అప్పుడు ఉన్న మోటరు కాలిపోతే మల్లా రూ.20 నుంచి రూ.30 వేలు ఖర్సు అయితయ్. యాడికెంచి పెట్టుకుంటం. వాగులు, కాలువలు, చెరవులల్ల ఆ మోటర్లు పనిచేస్తాయ్.. ఇక్కడ 5 హస్పర్ల మోటర్లు మస్తు. రేవంత్ అటున్నట్లు మూడు గంటల కరెంటు ఇస్తే మల్లా పొలాల కాడ జాగారం చేసుడైతది..

**-చందర్, రైతు, సోమరేగడి తండా**

# నేడు కేటీఆర్ రోడ్ షో

- భిక్కనూర్, బీబీపేటలో పర్యటన
- ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమాలు



నిజామాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కామారెడ్డి నియోజకవర్గంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. భారత రాష్ట్ర సమితి అధినేత, సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నియోజకవర్గం కావడంతో ప్రజల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఓటమి ఎరుగని నాయకుడిగా గుర్తింపు పొందిన కేసీఆర్‌కు కామారెడ్డిలో గెలుపు నల్లేరు మీద నడకే అన్నట్లుగా ఉండగా భారీ మెజార్టీయే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తున్నది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌చార్జిగా ఉన్న కామారెడ్డి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఇతర సమన్వయ కమిటీ సభ్యులంతా కలిసి భారీ మెజార్టీ కోసం శ్రమిస్తున్నారు. మండలాల వారీగా ఇన్‌చార్జిలను, 266 బూత్‌లకు బాధ్యులను ఇప్పటికే నియమించిన గులాబీ పార్టీ... రోజువారీగా శ్రేణులతో మాట్లాడుతూ సమన్వయం చేస్తున్నది. చేరికలతోపాటు ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్న వేళ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో మరింత ఉత్సాహాన్ని అందించనున్నది. శనివారం కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్, బీబీపేట మండలాల్లో కేటీఆర్ పర్యటిస్తారు.

**గులాబీ సందడి...**

సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నియోజకవర్గం కావడంతో కామారెడ్డిలో శ్రేణులంతా కలిసి పెద్ద సార్‌కు భారీ మెజార్టీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సీఎం కేసీఆరే స్వయంగా వచ్చి పోటీ చేస్తామంటే తామంతా మూకుమ్మడిగా ఓట్లేసి గెలిపించుకుంటామంటూ కామారెడ్డి నియోజకవర్గమంతా ఇప్పటికే ఏకగ్రీవ తీర్మానాలు చేసి మద్దతు తెలిపింది. కుల సంఘాలు, గ్రామ పంచాయతీల వారీగా ఇప్పటికే తీర్మానాలు జరిగాయి. కామారెడ్డి నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా ఈ ప్రాంతంపై దృష్టి సారించారు. ఇప్పటికే నియోజకవర్గం నేతలతో పలు దఫాలుగా సమావేశాలు, మండలాల వారీగా బీఆర్ఎస్ శ్రేణులతో సమీక్షలు, అంతర్గత సమావేశాలను నిర్వహించారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌తో ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలను తిప్పి కొట్టేందుకు వ్యూహాలను రచిస్తూ అమలు చేస్తున్నారు.

**ప్రజలతో ముఖాముఖి...**

ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ చేపట్టే రోడ్‌షోలు నేరుగా ప్రజలతో ముఖాముఖి అన్నట్లుగా నిర్వహించబడుతున్నాయి. కేటీఆర్ చెప్పే విషయాలను ఆలోచించి బీఆర్ఎస్ పార్టీకి మరోసారి జై కొట్టేందుకు సంసిద్ధులు అవుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 11గంటలకు భిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి నుంచి రోడ్‌షో మొదలవుతోంది. పలు గ్రామాల్లో ఒపెన్ టాప్ బస్సు ద్వారా పర్యటిస్తూ ఆయా ప్రాంతాల్లో ప్రజలను ఉద్దేశించి కీలక ప్రసంగాన్ని కేటీఆర్ చేస్తారు. కాంగ్రెస్, బీజేపీ చేష్టలను, ఆ పార్టీల వైఖరిని తనదైన శైలిలో కేటీఆర్ తిప్పికొట్టబోతున్నారు. కామారెడ్డి నుంచి కేసీఆర్ రాక సందర్భంగా వచ్చే ప్రభుత్వంలో ఈ నియోజకవర్గానికి జరుగబోయే మేలును వివరించనున్నారు. నవంబర్ 9న జరిగిన కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ అఖండ విజయం సాధించిన తర్వాత జరుగుతున్న కేటీఆర్ కార్యక్రమాలను దిగ్విజయం చేసేందుకు బీఆర్ఎస్ నేతలంతా ప్రయత్నాలు చేస్తున్నారు. మధ్యాహ్నం 2గంటలకు బీబీపేట మండలంలోని కాచాపూర్, మాందాపూర్, జనగామ గ్రామాల్లో రోడ్ షో ఉంటుంది. మధ్యాహ్నం 3గంటలకు బీబీపేట మండల కేంద్రంలో ప్రజలను ఉద్దేశించి మంత్రి కేటీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రసంగిస్తారు.

## సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు స్వాగతం పలుకుతున్న ముత్యంపేట గ్రామస్తులు

దోమకొండ, నవంబర్ 17: కామారెడ్డి నుంచి పోటీచేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కోరారు. దోమకొండ మండలంలోని చింతమాన్‌పల్లి, ముత్యంపేట్, లింగుపల్లి, సీతారాంపూర్ (గొట్టిముక్కుల), సంగమేశ్వర్, అంచనూర్,సీతారాంపల్లి, అంబారీపేట్ గ్రామాల్లో సీఎం కేసీఆర్ తరపున శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుంచారన్నారు. ఆయన చేసిన అభివృద్ధి మన కండ్ల ముందు ఉన్నదని తెలిపారు. ప్రజలు ఆశీర్వదించి కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో ఉన్న కరెంట్ కష్టాలు అందరికీ తెలుసని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చి రైతుల కష్టాలను దూరం చేశామని గుర్తుచేశారు. మూడు గంటల కాంగ్రెస్ కావాలా? వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చే కేసీఆర్ కావాలో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దోమకొండ మండల అధ్యక్షుడు గండ్ర మధుసూదన్ రావు, జడ్పీటీసీ తిర్మల్ గౌడ్, ఎంపీపీ కానుగంటి శారదానాగరాజు, మాజీ ఎంపీపీ కోట సదానంద, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.